క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ రాక్‌టౌన్, గణేశ్‌పురి, సాయినగర్, డెంటల్ కాలేజీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


పోటీలను ప్రారంభించిన ప్రశాంత్ కుమార్‌రెడ్డి

యాచారం: క్రీడాకారులను కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహించిందని, మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను నిర్మించిందని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధి నందివనపర్తిలో మాజీ సర్పంచ్, వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్త్యావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు.. మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. అనంతరం క్రీడా కారులకు టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మండల పరిధిలోని రామేశ్వరం గ్రామంలో గల శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కీ.శే మంచిరేవుల జంగయ్య, భీమమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంచిరేవుల సాయికృష్ణ, కళమ్మ దంపతులు నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం కల్యాణ మండపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తం, ఆశన్నగౌడ్, చంద్రశేఖర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి

కిడ్నీ స్పెషలిస్ట్ డా.రాధాకృష్ణ

మీర్‌పేట: సెల్‌ఫోన్ నుంచి పిల్లలను దూరంగా ఉంచాలని ప్రముఖ కిడ్నీ స్పెషలిస్ట్ డా.రాధాకృష్ణ తల్లిదండ్రులకు సూచించారు. మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీవిద్యా వాణి హైస్కూల్ వార్షికోత్సవ వేడుక శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డా.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ కిషన్‌రావు, ఇన్‌చార్జి చంద్రకళ, మాజీ కార్పొరేటర్లు అనిల్‌యాదవ్, నవీన్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే పేద ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు ఎంతో మేలు చేస్తాయని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊరేళ్ల గ్రామంలో ఆదివారం వైభవ్‌రెడ్డి సహకారంతో నగరంలోని టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయటంతో పాటు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు పెద్దసంఖ్యలో ఈ వైద్యశిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఎక్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు విఠలయ్య, జహంగీర్, అశోక్, శర్వలింగం, ఎ.శ్రీనివాస్, గ్రామ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం అంబేద్కర్ చౌరస్తాలో పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ లైట్


కావలోనిబాయి తండాలో పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ లైట్

పగలే వెలుగులు

- గ్రామాల్లో నిత్యం వెలుగుతున్న వీధిదీపాలు
- ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మహేశ్వరం: విద్యుత్ వృథాను అరికట్టాలని ప్రభుత్వాలు చెబుతున్నా మండలంలో సక్రమంగా అమలు కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యమో.. లేక పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడమో తెలియదు కానీ వీధి లైట్లు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. దీంతో ఆయా పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం ఎక్కువవుతోంది. రోజు ఉదయం, సాయంత్రం లైట్లను ఆన్‌ఆఫ్ చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినా వారి పట్టింపు కరువైంది.

పంచాయతీలపై భారం..

మహేశ్వరం మండలంలోని మహేశ్వరం, ఉప్పుగడ్డ తండా, మన్సాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో వీధి లైట్లు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. దీంతో ఆయా పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం ఎక్కువవుతోంది. రోజు ఉదయం, సాయంత్రం లైట్లను ఆన్‌ఆఫ్ చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినా వారు పట్టించుకోవడం లేదు. విద్యుత్ దీపాలు ఆన్ ఆఫ్ చేయకపోవడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోంది. దీంతో విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక లైన్‌లు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను ఆదా చేయాలని చెబుతున్నా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రి పూట ఆన్ చేసి ఉదయం ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వేల రూపాయల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి స్తంభాలకు టైమర్ ఏర్పాటు చేసి సాయంత్రం స్తంభాలకు విద్యుత్ దీపాలను ఆన్ చేసి ఉదయం ఆఫ్ చేయాలి. వీధి దీపాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి స్విచ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలోని మెజార్టీ గ్రామ పంచాయతీలలో ఉన్న వీధి దీపాలకు ఆన్ ఆఫ్‌లు, టైమర్లను బిగించాం. కొన్ని గ్రామ పంచాయతీల్లో టైమర్ మరమ్మతులకు గురి కావడంతో సమస్య తలెత్తుతోంది. విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి విద్యుత్ స్తంభానికి ఉన్న లైట్లకు టైమర్లు, ఆన్‌ఆఫ్‌లు బిగించి విద్యుత్ వృథా కాకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం

ఆరోగ్యంపై దృష్టి సారించాలి


క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై కొంత సమయం కేటాయిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ఉమర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉరుకులు, పరుగుల దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఆటలు ఆడడం ద్వారా శారీరకంగా దృడంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. బస్తీ యువత సౌకర్యార్థం ఇలాంటి గ్రౌండ్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న రంజాన్‌మాసం సందర్భంగా మజీద్‌ల పరిసరాలలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్య లేకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ముస్లింలకు అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహ్మద్ జిలానీ, అదీబ్ అహ్మద్, సుల్తాన్ అలీ, జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు షర్ఫొద్దీన్ హామెద్, సయ్యద్ యూసుఫ్ పటేల్, సయ్యద్ ఫెరోజ్, శంషుద్దీన్, సాంబ శివ, మేరాజ్ ఖాన్, హామెద్ అజీజ్, అలీ మన్సూరీ, దస్తగిర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకులు తరుచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోని చందన హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చందన, మురళీ, కిరణ్, నాయకులు అరవింద్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సతీష్‌కుమార్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ షాపుల వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చింతలకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన వనస్థలిపురం టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత కొన్ని రోజుల క్రితం మృతిచెందిన నరేష్ కుటుంబ సభ్యులకు అసోసియేషన్ సభ్యులు సమకూర్చిన రూ. 2 లక్షలను ఎమ్మెల్యే అందజేశారు. తమ అసోసియేషన్ కోసం కొంత స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, అసోసియేషన్ సభ్యులు అరవింద్‌రెడ్డి, మొయిన్, నరేందర్‌రెడ్డి, ప్రసాద్, దామోదర్‌గౌడ్, అజయ్, నర్సింహా యాదవ్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

మహిళల ఉపాధి కల్పనకు కృషి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మహిళలకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో బ్లూ ఓసియన్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యువతకు నైపుణ్యం గల విద్యను అందించడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. కడ్తాల్ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఫోర్త్‌సిటీ ద్వారా యువతకు అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం రాయితీ కలిపిస్తుండటంతో.. విదేశీ పెట్టుబడిదారులు తెలంగాణలో కంపెనీలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారని వివరించారు. హైదరాబాద్–రంగారెడ్డి జిల్లాలలో కంపెనీలు రావడం వలన ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని ఆయన చెప్పారు. ఫ్యాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లూ ఓసియన్ కంపెనీ అధినేత రామ్మోహన్‌రావ్, కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర సభ్యుడు బాలాజీసింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ నారాయణ, కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఫ్యాక్స్‌కాన్ ప్రతినిధి శ్రీకాంత్, ఓసియన్ ప్రతినిధులు మంగబాబు, సుబ్బారావ్, మణిరత్నం, కోటేశ్వర్, బీసీ సంఘం నాయకులు వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తలకొండపల్లి మండలం అంతారంలో నిర్మించనున్న హనుమాన్ దేవాలయాని ఎమ్మెల్యే కసిరెడ్డి రూ. లక్ష విరాళం ఇచ్చారు. రాములు యాదవ్, జగతయ్య, కిశోర్, లింగంలకు విరాళం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

మంచాల: బీఆర్‌ఎస్ హయాంలో, నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందిందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు జంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక జాతీయ స్థాయి పరిశ్రమలు వచ్చాయని పేర్కొన్నారు. తద్వారా ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారని వెల్లడించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం.. కనీసం ఇచ్చిన హామీలను అమలు చేయలేక పోతుందని ఆరోపించారు. ఎంతసేపు ప్రతి పక్ష నేతలపై విమర్శలు చేయడం తప్ప.. ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. విమర్శలు మాని.. ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు.

శివరాత్రి వేడుకలకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నేతలు

యాచారం: మహాశివరాత్రిని పురస్కరించుకుని నందివనపర్తిలో నిర్వహించే వేడుకలకు రావాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నేత వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న తండావాసులు

కందుకూరు: మండల పరిధిలోని పెద్దమ్మతండాలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో ఆదివారం రెండోరోజు గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు లచ్యానాయక్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పూజల్లో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ సర్పంచ్ సుమన్‌నాయక్, నాయకులు రాములునాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, లక్ష్మణ్‌నాయక్, వర్ష, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తిని చాటాలి


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎడ్ల వాసుదేవారెడ్డి

పహాడీషరీఫ్: మామిడిపల్లి ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 45రోజుల పాటు కొనసాగనున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఏడు జట్లు పాల్గొంటున్నాయి. గ్రామానికి చెందిన నాయకుడు ఎడ్ల వాసుదేవారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. రెడ్ బుల్స్, మామిడిపల్లి సూపర్ కింగ్స్, నైట్ వాకర్స్, టీం జగన్, బెంగాల్ టైగర్స్, కింగ్ ఫిషర్, ఆర్‌బీఎం వారియర్స్ తదితర జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. విజేత జట్టుకు రూ.35వేలు, రన్నరప్‌కు రూ.25 వేల నగదు పురస్కారాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. మామిడిపల్లి గ్రామంలో యువకులంతా ఏకతాటిపైకి వచ్చి క్రికెట్ ఆడడం అభినందనీయమన్నారు. రాజకీయాలు, గొడవలకు తావులేకుండా ఆడుతూ క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుక్క శివకుమార్, నాయకులు ఈరంకి విశ్వనాథ్‌గౌడ్, మహ్మద్ నయీం, నరేందర్ యాదవ్, లిక్కి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: బంజారాల ఆరాధ్య దైవం సత్ సేవాలాల్ మహరాజ్ అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలిపిన మహనీయుడు సేవాలాల్ అని గుర్తుచేశారు. అనంతరం భోగ్ బండార్ ర్యాలీని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు రమావత్ కల్యాణ్ నాయక్, ఐలయ్య, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, బంజారాలు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

చేవెళ్ల: దైవచింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తోందని మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని భువనేశ్వరి సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం శివస్వాముల మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి గాను బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి రూ.1లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, శర్వలింగం, ఆంజనేయులు, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, జయసింహ, ఆనంద్, ప్రజలు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆమడదూరం

ఉరుకుల పరుగుల జీవితంలో సగటు మనిషి.. పచ్చని చెట్లు, చెరువుగట్లపై సేద తీరాలని కోరుకుంటారు. కానీ ఆమనగల్లు పురపాలికలో ఒక్క పార్కు లేదు. ఉన్న చెరువు వద్ద ప్రశాంతంగా గడపలేని దుస్థితి. ఫలితంగా ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఆరాట పడుతున్నారు.

పురపాలికలో పార్కులు కరువు

- అసంపూర్తిగా మినీ ట్యాంక్‌బండ్ పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


పార్కు ఏర్పాటు చేయాలనుకున్న అయ్యప్ప కొండ ప్రాంతం

ఆమనగల్లు: ఆమనగల్లులో ఆహ్లాదం కరువైంది. మున్సిపాలిటీగా అభివృద్ధి చెందినప్పటికీ.. ఒక్కటంటే ఒక్క పార్కును ఏర్పాటు చేయలేదు. దీంతో సేద తీరేందుకు నందనవనాలు లేక.. పుర ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కనీసం సురసముద్రం చెంతనన్న కాసేపు ప్రశాంతంగా గడుపుదామన్నా.. అనువుగా లేదని పేర్కొంటున్నారు. పట్టణానికి ఆనుకుని ఉన్న సురసముద్రం చెరువు వద్ద చేపట్టిన మినీ ట్యాంక్‌బండ్ పనులు అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని, పార్కుల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం పుర ప్రజలు ఆరోపిస్తున్నారు.

కలగా మినీట్యాంక్‌బండ్!

ఆమనగల్లు మేజర్ గ్రామ పంచాయతిని ఆరేళ్ల క్రితం మున్సిపాలిటీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు ఆమనగల్లు ముఖ్య కూడలిగా ఉంది. అయినప్పటికీ ఇక్కడ ఒక్కపార్క్ కూడా ఏర్పాటు చేయలేదు. పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు లేకపోవడంతో ప్రజలు ఆహ్లాద వాతావరణానికి నోచుకోకపోతున్నారు. ఇక స్థానిక సురసముద్రం చెరువును మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడానికి గతంలో ప్రభుత్వం రూ.5.8 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చెరువుకట్టను విస్తరించి, ఇరువైపులా రేయిలింగ్ ఏర్పాటు చేసి, వాకింగ్ ట్రాక్‌ను నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. కానీ పనులు చేపట్టినట్లే చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. మరో కోటి మంజూరు చేశారు. కానీ పనులకు మాత్రం మోక్షం కలగడం లేదు.

అసంపూర్తిగా పార్క్‌లు

మున్సిపాలిటీ కేంద్రం ఆమనగల్లులో పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. అందుకు పట్టణంలోని కాటన్‌మిల్లు ఎదురుగా ఉన్న వెంచర్‌లో ఎకరన్నర స్థలం కేటాయించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్.. స్థలం చుట్టూ ప్రహరి నిర్మించి మధ్యలోనే ఆపేశారు. అదే విధంగా అయ్యప్ప దేవాలయం ముఖద్వారం పక్కన రూ.10 లక్షలతో పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పనులు ప్రారంభించి వదిలేశారు. ఇలా నిధులు కేటాయించినా.. పార్కులు, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయడంలో మున్సిపల్ పాలకవర్గం విఫలమైంది. ఇప్పటికైనా ప్రజలు సేద తీరేందుకు అవసరమైన పార్కులను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.